www.aksharadarbar.com
గురువారం 15, ఆగస్టు 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :164 | పేజీలు : 05 | వెల : 05

ఆర్డీఓ రవికి ఉత్తమ అవార్డు

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించినందుకు నల్గొండ రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ ఎన్ రవికి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం నల్గొండలో జిల్లా కేంద్రంలో రోడ్లు, భవనంల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తమ అవార్డును అందజేశారు.

– అక్షరదర్బార్, నల్గొండ

- మరోమారు తెరపైకి మంత్రివర్గ విస్తరణ, పీసీసీ, నామినేటెడ్ పోస్టుల అంశం ..
- ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలు, సీఎం విదేశీ పర్యటనతో ఆలస్యం
- ముఖ్యమంత్రి అమెరికా నుంచి రావడంతో తాజాగా కసరత్తు
- ఢిల్లీకి బయలుదేరిన రేవంత్‌రెడ్డి
- ఏఐసీసీ అగ్రనేతలతో భేటీ కానున్న సీఎం
- పదవుల పందేరంపై కాంగ్రెస్‌లో జోరుగా చర్చ
- ఆశల పల్లకీలో నేతలు.. గాడ్‌ఫాదర్ల చుట్టూ చక్కర్లు..
- ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరికో ఛాన్స్
- ఆశావహులతోపాటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్



తెలంగాణలో మంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవుల అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో 39 కార్పొరేషన్ల భర్తీతోనే నామినేటెడ్ పోస్టుల ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత వెంటనే మిగిలిన పోస్టులను భర్తీ చేస్తారనే టాక్ వినిపించింది. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, అసెంబ్లీ సమావేశాలు, ముఖ్యమంత్రి బృందం విదేశీ పర్యటనకు వెళ్లడంతో మరింత గ్యాప్ వచ్చింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకోవడంతో మరోసారి పదవుల పందేరంపై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది. ఈక్రమంలోనే ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి బయలుదేరటంతో నేతల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి నామినేటెడ్ పోస్టుల్లో ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరెవరికి స్థానం దక్కుతుందో అని ఆశావహులతోపాటు కేడర్ లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలోనే కీలక పోస్టులు ఆశిస్తున్న నేతలు కొందరు ఇప్పటికే తమ గాడ్ ఫాదర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

ఎవరికో ?

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ

రైతు రుణం తీరింది

దేశ చరిత్రలో కొత్త రికార్డు .. రుణమాఫీ..

- మొదటి విడత రూ.6098.93 కోట్లు.. 11,50,193 మంది రైతులు
- రెండో విడత రూ.6190.01 కోట్లు.. 6,40,823 మంది రైతులు
- మూడో విడత రూ.5644.24 కోట్లు.. 4,46,832 మంది రైతులకు లబ్ధి
- మొత్తం మూడు విడతల్లో రుణ విముక్తులైన రైతులు 22,37,848 మంది
- రైతుల ఖాతాల్లో జమ చేసిన నిధులు రూ.17,934 కోట్లు

05

హరీశ్‌రావు.. రాజీనామా చెయ్ !

- లేకపోతే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

05

- వాడవాడలా మువ్వన్నల జెండా రెపరెపలు
- వరంగల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి
- హన్మకొండ, ములుగులో మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, డీసీసీబీ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు

- లోపలి పేజీల్లో

త్రివర్ణ శోభితం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

ఎవరికో..?

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ

- మరోమారు తెరపైకి మంత్రివర్గ విస్తరణ, పీసీసీ, నామినేటెడ్ పోస్టుల అంశం ..
- ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలు, సీఎం విదేశీ పర్యటనతో ఆలస్యం
- ముఖ్యమంత్రి అమెరికా నుంచి రావడంతో తాజాగా కసరత్తు
- ఢిల్లీకి బయలుదేరిన రేవంత్‌రెడ్డి
- ఏఐసీసీ అగ్‌నేతలతో భేటీ కానున్న సీఎం
- పదవుల పందేరంపై కాంగ్రెస్‌లో జోరుగా చర్చ
- ఆశల పల్లకీలో నేతలు.. గాడ్‌ఫాదర్ల చుట్టూ చక్కర్లు..
- ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరికో ఛాన్స్
- ఆశావహులతోపాటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి :

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవుల అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో 39 కార్పొరేషన్ల భర్తీతోనే నామినేటెడ్ పోస్టుల ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత వెంటనే మిగిలిన పోస్టులను భర్తీ చేస్తారనే టాక్ వినిపించింది. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, అసెంబ్లీ సమావేశాలు, ముఖ్యమంత్రి బృందం విదేశీ పర్యటనకు వెళ్లడంతో మరింత గ్యాప్ వచ్చింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకోవడంతో మరోసారి పదవుల పందేరంపై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది. ఈక్రమంలోనే ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి బయలుదేరటంతో నేతల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి నామినేటెడ్ పోస్టుల్లో ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరెవరికి స్థానం దక్కుతుందో అని ఆశావహులతోపాటు కేడర్ లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలోనే కీలక పోస్టులు ఆశిస్తున్న నేతలు కొందరు ఇప్పటికే తమ గాడ్ ఫాదర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

- మొదటి విడతలో ఆరుగురే..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపై ఉమ్మడి వరంగల్ నుంచి చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 39 మందికి మార్చిలోనే కార్పొరేషన్ పదవులు ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా జులై 8న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సీనియర్ నేతలు జంగా రాఘవరెడ్డి (రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్), ఇనుగాల వెంకట్రామిరెడ్డి (కుడా చైర్మన్), బెల్లయ్య నాయక్ (ఎస్టీ కార్పొరేషన్), ఎండీ రియాజ్(గ్రంధాయల సంస్థ), అయిత ప్రకాష్ రెడ్డి (వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్)కి అవకాశం దక్కింది. వీరితోపాటు గత శాసనసభ ఎన్నికల్లో భద్రాచలం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ములుగు నియోజకవర్గానికి చెందిన పోదెం వీరయ్య రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమితులయ్యారు. అంతకు ముందు ఇక్కడి నుంచి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియామకం అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 12 మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కగా, కాంగ్రెస్‌లో మాత్రం ఇప్పటి వరకు ఆరుగురికే కార్పొరేషన్ పదవులు వరించాయి. మరో ఆరుగురు సీనియర్లకు అవకాశం దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది. మలి విడతలో ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరెవరిని పార్టీ అధిష్టానం ఎంపిక చేస్తుంది అనేది ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

- ప్రొటోకాల్ సమస్య..

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకుగాను పది చోట్ల కాంగ్రెస్ గెలుపొందింది. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరగా అక్కడ ఓటమి చెందిన సింగపురం ఇందిరకు ప్రొటోకాల్ సమస్య ఎదురవుతోంది. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇబ్బంది కలుగుతోంది. పాలకుర్తి నియోజకవర్గంలో అనూహ్యంగా తప్పుకున్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డిది ఇదే పరిస్థితి. తన కోడలు యశస్విని ఎమ్మెల్యేగా గెలిపించిన ఆమె కూడా కార్పొరేషన్ చైర్మన్ కోసం పావులు కదుపుతున్నారు. జనగామలో బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూడా నామినేటెడ్ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

- ఆశల పల్లకిలో..

వరంగల్ ఎంపీ టికెట్ దక్కినట్టే దక్కి తృటిలో చేజారిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, సీనియర్ నేత దొమ్మటి సాంబయ్యకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ ఖాయంగా కనిపిస్తోంది. ఆయన పేరు ఉమ్మడి జిల్లా నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి క్రియాశీలకంగా ఉన్న వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ కూడా రాష్ట్రస్థాయి పదవి ఆశిస్తున్నారు. వర్ధన్నపేట అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు బట్టి శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్ రావు, ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, కూచన రవళిరెడ్డి, బండి సుధాకర్ గౌడ్‌తోపాటు మరికొందరు నామినేటెడ్ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే వీరిలో ఎవరిని అదృష్టం వరిస్తుందనేది మరికొద్ది రోజుల్లోనే తేలనుంది.

ఢిల్లీకి సీఎం రేవంత్..

సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు ఢిల్లీకి బయలుదేరారు. రెండు, మూడు రోజులు ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ హైకమాండ్‌తో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. కొత్త పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో ఆయన చర్చించనున్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఓపెనింగ్ కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించనున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన రైతు రుణమాఫీ పథకం ఈరోజుతో విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న రైతు కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని సీఎం రేవంత్ ఆహ్వానించనున్నట్లు సమాచారం.

పంద్రాస్టున అక్రమంగా మద్యం విక్రయాలు

- నగరంలో ముగ్గురు బెల్ట్ షాప్ నిర్వాహకులపై కేసు
- రూ. 4 లక్షల విలువైన మద్యం స్వాధీనం

అక్షరదర్బార్, వరంగల్: నిబంధనలకు విరుద్ధంగా పంద్రాగస్టున నగరంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న బెల్ట్ షాప్ నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మిల్స్‌కాలనీ పరిధిలోని సాకరాశికుంట ఎస్సీకాలనీలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుపై టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు దాడి చేశారు. ఆగస్టు 15 కొరత దృష్ట్యా నిందితుడు వైన్ షాప్‌తో ఒప్పందం కుదుర్చుకొని మద్యం నిలువ ఉంచి అధిక ధరలకు అమ్ముతున్నారన్న సమాచారంతో ఎనగందుల రాజును పట్టుకున్నారు. బెల్ట్ షాప్ నుంచి 2,86,590 రూపాయల విలువగల మద్యం స్వాధీనపర్చుకొని, నిందితుడిని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అక్రమ మద్యం పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్లు ఎస్ రవికుమార్, ఎం రంజిత్ కుమార్, ఎస్సై శరత్ కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

సుబేదారిలో..

వడ్డేపల్లిలోని ముదిరాజ్ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుపై టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు దాడి చేశారు. నిందితురాలు మిట్టపల్లి రమాదేవిపై కేసు నమోదుచేసి, 50,130 రూపాయల విలువగల మద్యం స్వాధీనపర్చుకున్నారు. నిందితురాలిని విచారణ నిమిత్తం సుబేదారీ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా సుబేదారిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్ నిర్వాహకుడు పెసరు రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. రూ. 77830 విలువగల మద్యం స్వాధీనంచేసుకున్నారు.

సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

- పూసుగూడెంలో పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు
- కేసీఆర్, హరీష్ రావుపై ఫైర్
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు దోచుకున్నారని ధ్వజం

అక్షరదర్బార్, భద్రాద్రి కొత్తగూడెం : సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా పూసుగూడెం పంప్ హౌస్‌ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు రీడిజైనింగ్ పేరుతో వేల కోట్లు దోచుకోవచ్చని చూశారు తప్పా ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న ఆలోచన ఏనాడు మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావుకు లేదని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, అదేవిధంగా పాలమూరు జిల్లాలోనూ పరిస్థితులు ఇదే రకంగా ఉన్నాయని అన్నారు. గత పదేళ్లులో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసిన రైతులకు నీళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. అంతకు ముందు సీతారామ ప్రాజెక్టు మొదటి పంప్ హౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. అలాగే భద్రాద్రిలోని మూడో పంప్ హౌస్‌ను ములకలపల్లి మండలం కమలాపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

భూపాలపల్లి ప్రెస్ క్లబ్ లో జెండావిష్కరణ చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

పరకాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జెండావిష్కరణ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

జెండా వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

జెండా ఎగురవేసిన రేగొండ తహసీల్దార్ శ్వేతా రావు

- రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- పాఠశాలల్లో విద్యార్థుల ర్యాలీలు
- ప్రత్యేక ఆకర్షణగా జాతీయ నాయకుల వేషాధారణలు
- జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం

అక్షర దర్బార్, నెట్ వర్క్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తూ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు. భూపాలపల్లి ప్రెస్ క్లబ్ లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. రేగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో శ్వేతా రావు జెండావిష్కరణ చేశారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా భూపాలపల్లిలో దాసరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాసరి కిరణ్ అధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు రజనికాంత్, రాజేష్, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు..

కేసముద్రంలో..

కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో దామోదర్ జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్, డిటి ఎర్రయ్య, ఆర్ఐలు సౌజన్య, బాబు, సూపరింటెండెంట్ సత్య ప్రకాష్, కృష్ణ, పవన్, భాస్కర్ పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ మురళీధర్ రాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు. ఎల్ హెచ్ పీఎస్ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్ జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, చిలువేరు సమ్మయ్య గౌడ్, ఆగే మంజుల, ముత్యాల శివకుమార్, బుడ్డా నాయక్, రావుల మురళి, ఓలం రమేష్ పాల్గొన్నారు.

పరకాలలో..

అక్షర దర్బార్, పరకాల : పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఏసీపీ కిషోర్ కుమార్, ఆర్డీవో డాక్టర్ నారాయణ , తాహసీల్దార్

ఏవీ భాస్కర్, నడికూడలో తహసీల్దార్ నాగరాజు, సీఐ క్రాంతికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ, ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు, జెండా విష్కరణ చేసి పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నర్సంపేటలో..

నర్సంపేట డివిజన్లోని చెన్నారావుపేట, నెక్కొండ, నల్లబెల్లి, ఖానాపురం, దుగ్గొండి నర్సంపేట మండల కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు కార్యాలయాల్లో , వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఆయా పార్టీల అధ్యక్షులు త్రివర్ణ పతాకం ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శభాష్.. కాటారం ఎస్సై అభినవ్

అక్షర దర్బార్, కాటారం : మండలంలో క్రైం రేట్ తగ్గించడంతో పాటు గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతూ తనదైన శైలిలో విధులు నిర్వర్తిస్తున్న కాటారం ఎస్సై అభినవ్కు ఉత్తమ ఉద్యోగ విధుల ప్రశంసా పత్రం దక్కింది. గురువారం పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. అనంతరం ఎస్సై అభినవ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రశంసా పత్రం లభించడం ఆనందంగా ఉందన్నారు.

నడికూడ తహసీల్దార్ కార్యాలయంలో..

పోదెం వీరయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్సై అభినవ్

పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న పోదెం వీరయ్య

కేసముద్రం పోలీస్ స్టేషన్ లో

కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో..

బాలాజీ విద్యాసంస్థల్లో జెండావిష్కరణల చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి

జెండావిష్కరిస్తున్న దుగ్గొండి తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి

పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న నాగూర్ల వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

త్రివర్ణశోభితం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు
- వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు
- వరంగల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి
- హన్మకొండ, ములుగులో మంత్రులు కొండా సురేఖ, సీతక్క..

వరంగల్, అక్షరదర్బార్ :
పంద్రాగస్టును పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా త్రివర్ణశోభితమైంది. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. వాడవాడలా మువ్వన్నల జెండా రెపరెపలాడింది. వరంగల్ జిల్లాలో నిర్వహించిన వేడుకలకు ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయజెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. పలువురు ఉద్యోగులకు మెమొంటోలు, ప్రశంసాప్రతాలు అందజేశారు.

హన్మకొండ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కొండా సురేఖ, మలుగులో మంత్రి సీతక్క జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జనగామ జిల్లాలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మహబూబాబాద్‌లో విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, భూపాలపల్లిలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు, ఎస్పీలు ఇతర ఉన్నతాధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఇక గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ అశ్విని వాకడే, హన్మకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కాకతీయ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు జాతీయ జెండాలను ఎగురవేశారు. అంతేగాక జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ఆయా పార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

అక్షర దర్బార్
voice of the people తెలుగు దినపత్రిక

హరీష్ రావ్.. రాజీనామా చెయ్!

- లేకపోతే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు
- బీఆర్ఎస్ బతుకు బస్టాండైంది..
- ఖమ్మం గడ్డ కాంగ్రెస్ అడ్డా..
- వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, ఖమ్మం: మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. ఖమ్మం జిల్లాలోని వైరాలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ అమలు పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసిందని, హరీష్‌రావు సవాల్ ప్రకారం.. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హరీష్‌కు సిగ్గు, శరం, చీము, నెత్తురు ఉంటే వెంటనే సిద్దిపేటలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, ఏట్లో దూకి సావాలన్నారు. లేకపోతే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. దీంతో సిద్దిపేటకు పట్టిన పీడ విరుగడువు తుందని రేవంత్ దుయ్యబట్టారు. ఇప్పటికే బీఆర్ఎస్ బతుకు బస్టాండ్ అయిందని, అయినప్పటికీ ఆపార్టీ నేతలకు బుద్ధిరావడం లేదని మండిపడ్డారు. ఖమ్మం గడ్డ.. కాంగ్రెస్ అడ్డ అని రేవంత్ వ్యాఖ్యానించారు. మే 6, 2022న కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ చేసిందని.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేసిందన్నారు. వరంగల్ వేదికగా తెలంగాణ రైతులకు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని.. ఇచ్చిన హామీ మేరకు రూ. 31 వేల కోట్లతో రుణమాఫీ చేశామని రేవంత్ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

- చెర్లపాలెం గ్రామంలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

అక్షర దర్బార్, తొర్రూరు: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. తొర్రూరు ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కర్ర అశోక్ రెడ్డి (58) అనే వ్యక్తి భార్య 2016లో మరణించింది. అప్పటి నుండి మద్యానికి బానిసై తరుచూ ఇంట్లో గొడవ చేస్తుండేవాడని, బుధవారం రాత్రి ఇంటికి తాగి రావడంతో ఎందుకు తాగి వచ్చావని మందలించడంతో క్షణికావేశంలో వారి పొలం వద్ద వేపచెట్టుకు ఉరివేసుకొని మరణించినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సందీప్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ చైర్ పర్సన్‌గా ఆనంద్ మహీంద్రా..

- ఏడాదిపాటు పదవిలో..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్షరదర్బార్: తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఆటోమొబైల్, ఏయిరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి ప్రముఖ రంగాల్లో మహీంద్రా గ్రూపు సంస్థలకు ఆయన చైర్మన్‌గా ఉన్నారు. ఇటీవల ఆనంద్ మహీంద్రాతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. ఆయనకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించారు. ఈ క్రమంలో ఆ యూనివర్సిటీ కి చైర్ పర్సన్ గా కొనసాగాలను కోరారు. కాగా , ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్స్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం ఆనంద్ మహీంద్రాను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

రైతు రుణం తీరింది

- దేశ చరిత్రలో కొత్త రికార్డు .. రుణమాఫీ..
- మొదటి విడత రూ.6098.93 కోట్లు.. 11,50,193 మంది రైతులు
- రెండో విడత రూ.6190.01 కోట్లు.. 6,40,823 మంది రైతులు
- మూడో విడత రూ.5644.24 కోట్లు.. 4,46,832 మంది రైతుల కు ల బ్ధి
- మొత్తం మూడు విడతల్లో రుణ విముక్తులైన రైతులు 22,37,848 మంది
- రైతుల ఖాతాల్లో జమ చేసిన నిధులు రూ.17,934 కోట్లు

అక్షరదర్బార్, హైదరాబాద్: రైతులకు ఇచ్చిన మాటను తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఆగస్ట్ 15లోగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారు. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పారు. జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 30వ తేదీన అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమం అమలు చేసింది. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభ వేదికపై ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతులకు అసలైన స్వరాజ్యం వచ్చిందని.. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు ప్రకటించారు. కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేయటం చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. కాగా, మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ కానున్నాయి. రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం ముగియనుంది. రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించనున్నట్లు రుణమాఫీ విధి విధానాల్లో ప్రభుత్వం ముందుగానే వెల్లడించింది.

బయ్యారంలో దొంగల ముఠా హల్ చల్

దేహ శుద్ధిచేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

మహబూబాబాద్ , అక్షరదర్బార్ : మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో దొంగలు హల్చల్ చేశారు. బంగారం అమ్ముతామని చెప్పి రూ. 2 లక్షల తీసుకొని నకిలీ బంగారం అంటగట్టి పరారవుతుండగా పట్టుకుని దేహశుద్ధి చేశారు. బాధితుల కథనం ప్రకారం.. బయ్యారం మండల కేంద్రంలో రాజస్థాన్ నుంచి వచ్చిన దొంగల ముఠా బంగారం అమ్ముతామని స్థానికులను నమ్మించింది. దీంతో తక్కువ ధరకు బంగారం వస్తుందన్న ఆశతో పలువురు బాధితులు రూ. 2 లక్షలు ముట్టజెప్పారు. డబ్బు అవసరై బ్యాంక్ కి వెళ్తే అసలు విషయం బయటపడింది. అది నకిలీ బంగారం అని బ్యాంకు సిబ్బంది తేల్చిచెప్పడంతో బాధితులు లబోదిబోమంటూ దొంగల కోసం గాలించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గాలించగా ఇద్దరు వ్యక్తులు చిక్కడంతో దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. ఈనెల 5వ తేదీన వర్ధన్నపేట పట్టణంలోని ఓ షాపు యజమానికి నకిలీ బంగారం అమ్మేందుకు ఈ ఇద్దరు సభ్యులు ప్రయత్నం చేసినట్లు సమాచారం. సీసీ కెమెరాల్లో వీరి బాగోతం రికార్డుఅయినట్లు తెలిసింది.

హెడ్ క్వార్టర్స్ లో నృత్యం చేస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జరిగిన పరేడ్ లో పోలీసుల కవాత్